# రూ.23 వేల కోట్ల పెట్టుబడులు!

- రాష్ట్ర ప్రభుత్వంతో ఏడు మలేషియా సంస్థల ఒప్పందాలు
- వేదికగా 'ఏషియన్-ఇండియా బిజినెస్ లీడర్‌షిప్ సమ్మిట్'

ఈనాడు – అమరావతి, టెక్కలి – న్యూస్‌టుడే

ఆంధ్రప్రదేశ్‌లో రూ.23 వేల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు మలేషియాకు చెందిన పలు కంపెనీలు ముందుకు వచ్చాయి. రాష్ట్ర ప్రభుత్వంతో ఏడు అవగాహన ఒప్పందాలు చేసుకున్నాయి. కౌలాలంపూర్‌లో గురువారం జరిగిన 'ఏషియన్-ఇండియా బిజినెస్ లీడర్‌షిప్ సమ్మిట్'కి రాష్ట్ర యువజన, కార్మిక, ఉపాధి కల్పన శాఖల మంత్రి అచ్చెన్నాయుడు ఆధ్వర్యంలో వెళ్లిన రాష్ట్ర బృందం ఆగ్నేయాసియా దేశాల సంఘం (ఏఎస్ఈఏఎన్)తో జరిపిన చర్చల ఫలితంగా ఈ ఒప్పందాలు జరిగాయి. తమ సభ్య సంస్థల ఉమ్మడి భాగస్వామ్యంతో రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సంబంధిత బయోడీజిల్ ఉత్పత్తుల ప్రాజెక్టు ఏర్పాటుకి మలేషియన్ బయోడీజిల్ అసోసియేషన్ (ఎంబీఏ) సంసిద్ధత వ్యక్తం చేసింది. రూ.6,713 కోట్ల పెట్టుబడులు పెడతామని, 5 వేల మందికి ఉపాధి కల్పిస్తామని ఆ సంస్థ పేర్కొంది. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ ఆర్థిక అభివృద్ధి బోర్డు (ఈడీబీ)తో ఒప్పందం చేసుకుంది. రూ. 167.50 కోట్ల ప్రాథమిక పెట్టుబడులతో పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టు ఏర్పాటుకి అంటా స్ట్రాటజిక్ సర్వీసెస్ సంస్థ ఈడీబీతో ఒప్పందంపై సంతకాలు చేసింది. రాష్ట్రంలో రూ.3,360 కోట్ల అంచనా వ్యయంతో నీటి శుద్ధి కర్మాగారం ఏర్పాటుకి ప్రోటాస్కో బెర్హాద్, కోప్ మేంటాప్ బెర్హాద్ (మలేషియాలో పోలీసు సహకార సంస్థ) ఒప్పందం చేసుకున్నాయి. హైగార్డ్ ఎస్డీఎన్ బీహెచ్‌డీ సంస్థ రాష్ట్రంలో రూ. 6,720 కోట్లతో వాటర్, సీవరేజ్ ప్లాంట్ ఏర్పాటుకి అంగీకరించింది. ఇదే సంస్థ రూ.2,688 కోట్ల నుంచి రూ.3,360 కోట్ల పెట్టుబడులతో ఇంటిగ్రేటెడ్ రీటెయిల్ హౌసింగ్ ప్రాజెక్టు చేపడతామని చెప్పింది. ఈ రెండు ప్రతిపాదనలపై ఆ సంస్థకు, ఈడీబీకి మధ్య ఒప్పందాలు జరిగాయి. ఆహార, పానీయాల రంగంలో రూ.10 కోట్లతో ప్రారంభించి, దశలవారీగా రూ.50 కోట్లు పెట్టుబడి పెట్టేందుకు సుమ్‌విన్ సొల్యూషన్స్ మలేషియా ఎస్డీఎన్ బీహెచ్‌డీ సంస్థ ఆసక్తి కనబరిచింది. రూ.33.5 కోట్ల నుంచి రూ.67 కోట్ల వరకు పెట్టుబడులతో బయోటెక్నాలజీ, ఇతర రంగాల్లో పరిశ్రమల స్థాపనకు ఎన్టోగెనెక్స్ ఇండస్ట్రీస్ ముందకు వచ్చింది. రాష్ట్రంలో ఉన్న పెట్టుబడి అవకాశాలు, అనుకూల వాతావరణం గురించి అచ్చెన్నాయుడు వివరించారు. విస్తారమైన సహజ వనరులు, మానవ వనరులు ఉన్నాయని, ప్రభుత్వం నుంచి అన్ని రకాల ప్రోత్సాహం ఉంటుందని ఆయన తెలిపారు. మలేషియా, ఆంధ్రప్రదేశ్ మధ్య పరస్పర వ్యాపార, వాణిజ్య అవకాశాలు మెరుగుపరుచుకోవడానికి ఈడీబీ, పెమాండు, మలేషియా పీఎంఓల ప్రాతినిధ్యంతో పటిష్ఠ యంత్రాంగం ఏర్పాటు చేసుకుందామని ఆ దేశ వాణిజ్య, పరిశ్రమల మంత్రి ముస్తఫా మహ్మద్ సూచించారు. వెంటనే మలేషియాలో ఒక కార్యాలయం ఏర్పాటు చేయాలని ఈడీబీని ఆయన కోరారు. ఈ సదస్సులో ఈడీబీ ఈసీఓ జె.కృష్ణకిషోర్, పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి కరికాల వలవన్ పాల్గొన్నారు.



'ఏసియన్ ఇండియా బిజినెస్ లీడర్‌షిప్ సమ్మిట్'లో ప్రసంగిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు